బీసీల సత్తా చూపిస్తాం..

బీఆర్ఎస్‌తోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యం

ఓటుతో అహంకారులకు బుద్ధి చెప్పాలి

మన ఓట్లు మనమే వేసుకుందామని ఇంటింటికీ ప్రచారం

బీఆర్ఎస్‌తోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యపడుతుందని బీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీలకు అతీతంగా బీసీలు ఏకమై విజయమే లక్ష్యంగా అడుగులు వేయాలని కోరుతున్నారు. పార్లమెంటులో బడుగు బలహీన వర్గాల గొంతుక వినబడాలంటే కాసానిని గెలిపించుకుని తీరాలని బీసీ సంఘాలు పిలుపునిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో బీసీలు సంఘటితం కాకపోతే.. ముమ్మందు మరింతమంది నాయకులు కాంగ్రెస్ నేత మోహన్‌రెడ్డిలాగే అహంకారపూరితంగా మాట్లాడతారని బీసీ సంఘాల నేతలు పేర్కొంటున్నారు. కులహంకారంతో మాట్లాడుతున్న నేతలకు వత్తాసు పలికితే రాబోయే రోజుల్లో బీసీ వర్గాలకు ఎదురయ్యే పరిస్థితులు ఇప్పుడే కండ్ల ముందర కదలాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మన ఓట్లు మనమే వేసుకుందాం.. అనే నినాదాన్ని అన్ని గ్రామాలకు, బీసీ కులాలకు చేరేటట్లు చేసి మేల్కొలుపుదామని చెబుతున్నారు. బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూసే నేతలకు ఈ ఎన్నికల్లో వేసే ప్రతి ఓటు చెంపపెట్టులా ఉండాలన్నారు.

- రంగారెడ్డి, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ)

గులాబీ జెండా ఎగురవేద్దాం

చేవెళ్ల పార్లమెంట్ గడ్డపై గులాబీ జెండాను ఎగుర వేద్దాం. బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించి ఎంపీగా పార్లమెంట్‌కు పంపుదాం. బీసీల ఏకైక గొంతుకైన కాసానికి ప్రతి బీసీ మద్దతుగా నిలువాల్సిన అవసరం వచ్చింది. అయన చేసిన పోరాటాల ఫలితంగా ఎంతో మంది బీసీలు ఆర్థికంగా ఎదిగారు.

- హుస్సేన్, బషీరాబాద్

బీసీలంతా ఒక్కటయ్యే అవకాశం వచ్చింది

బీసీలంతా ఒక్కటయ్యే మంచి అవకాశం వచ్చింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి బీసీ అయిన కాసాని జ్ఞానేశ్వర్‌ను పార్లమెంట్ అభ్యర్థిగా పోటీకి దింపడంతోనే దాదాపు గెలుపు ఖాయమైంది. బీసీలంతా ఒక్కటైతే కాసానికి భారీ మెజార్టీ వస్తుంది. ఈ అవకాశం మళ్లీ రాదు.

- సునీల్‌ప్రసాద్, బషీరాబాద్

బీసీల ఐక్యతకు మంచి అవకాశం

చేవెళ్ల పార్లమెంటు స్థానానికి బీఆర్ఎస్ పార్టీ తరపున బీసీ నేత కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుందాం. బీసీల బలం.. ఐక్యతను నిరూపించుకోవడానికి మంచి అవకాశం వచ్చింది. బీసీలు ఏ పార్టీలో ఉన్నా పార్టీలకు అతీతంగా బీసీ నేతను గెలిపించుకుందాం. బీసీలు ఎక్కువ జనాభా ఉన్న మనలో ఐక్యత లేకపోవడంతో ప్రజాప్రతినిధులుగా ఎదగలేకపోతున్నాం.

- రాజశేఖర్, మోత్కుపల్లి, మొయినాబాద్

బీసీలు చట్ట సభల్లో ఉండాలి

బీసీలు చట్ట సభల్లో ఎంత ఎక్కువ మంది ఉంటే అంత బీసీలకు మేలు జరుగుతుంది. బీసీ జనాభా ఎక్కువగా ఉన్నా బీసీలకు రావాల్సిన హక్కులు అందడం లేదు. అన్ని బీసీ సంఘాలు ఏకమై బీసీ నేతను ఎన్నుకుందాం. దీంతో ప్రభుత్వాల నుంచి వచ్చే పథకాలు సక్రమంగా అందుతాయి. బీసీలంతా మేలుకోవాలి.

- అరుణ్‌కుమార్, మత్స్య సహకార సంఘం ప్రధాన కార్యదర్శి, ఎన్కేపల్లి, మొయినాబాద్

బీసీలకు మంచి అవకాశం కల్పించారు కేసీఆర్

ఏ పార్టీలు బీసీలకు కల్పించని అవకాశాన్ని బీఆర్ఎస్ పార్టీ నుంచి కేసీఆర్ కల్పించారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని బీసీలందరూ ఒక్కతాటిపైకి వచ్చి ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి గెలిపించుకునే అవకాశం వచ్చింది. ఢిల్లీలో బీసీ వాదం వినిపించేలా అధిక మెజార్టీ నిస్తాం. జ్ఞానేశ్వర్ గెలుపునకు బడుగు, బలహీన వర్గాలకు చెందిన మేధావులు, విద్యావంతులు, యువకులు ఏకమౌతున్నారు.

- కరీం, రాకంచర్ల, పూడూరు మండలం

పార్టీని వీడిన నాయకులకు బుద్ధిచెప్తాం

బీసీలంతా ఏకమై బీఆర్ఎస్ పార్టీని వీడి ఇతర పార్టీలకు వెళ్లిన నాయకులకు ఈ పార్లమెంట్ ఎన్నికల్లో సరైన బుద్ధిచెప్తాం. చేవెళ్ల ఎంపీ టికెట్‌ను సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌కు బీఆర్ఎస్ కేటాయించడం సంతోషం. కాసాని ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంచి పేరున్న బీసీ వర్గానికి చెందిన నాయకుడు. భారీ మెజార్టీతో గెలిపిస్తాం.

- శ్రీనివాస్‌గౌడ్, పూడూరు మండలం

బీసీల ఐక్యతను చాటుదాం

చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటాం. బీసీ సామాజిక వర్గానికి ఎంపీ టికెట్ ఇచ్చిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేశారు. కాసానిని గెలిపిస్తే సామాజికంగా బీసీలకు న్యాయం జరుగుతుంది. బీసీల్లో బడుగు బలహీనవర్గాలకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి.

- మధుకర్, బూచన్‌పల్లి, మర్పల్లి

రాజకీయాలు పక్కన పెట్టాలి

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసే నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్. ఎన్నో ఏండ్లుగా అగ్రవర్గాలకు చెందిన నాయకుల గెలుపు కోసం బీసీ నేతలే అహర్నిశలు శ్రమించారు. ఇప్పుడు అన్ని వర్గాల ప్రజలు కలిసికట్టుగా బీసీ నాయకుడిని చేవెళ్ల గడ్డ నుంచి ఎంపీగా గెలిపించుకోవాలి. ప్రత్యేకంగా బీసీ నేతలు రాజకీయాలను పక్కనబెట్టి విజయమే లక్ష్యంగా పనిచేయాలి.

- వెంకటేశ్, కల్కోడ, మర్పల్లి

బీసీలంతా ఐక్యతతో గెలిపించుకోవాలి

బీసీ సామాజిక వర్గానికి చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించుకొని బీసీల ఐక్యతను ఢిల్లీలో చాటి చెప్పాలి. రాజకీయాలతో ఓట్లను చీల్చుకుని మన ఐక్యతను కోల్పోతే ఎదుటివారి ముందు పలుచన అవుతాం. ఈసారి కచ్చితంగా కాసానిని రాజకీయాలకు అతీతంగా గెలిపించుకోవాలి. లేదంటే అగ్రవర్గాల నేతల విమర్శలను చవిచూడాల్సిన పరిస్థితులు ఎల్లప్పుడూ ఉంటాయి.

- నాగేశ్‌యాదవ్, వట్టినాగులపల్లి

బీసీని బలపర్చి ఐక్యతను చాటుదాం

అన్ని రాజకీయ పార్టీల బీసీ నేతలు ఈసారి బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను గెలిపించుకునేందుకు రాజకీయాలను పక్కన పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గతంలో అన్ని రాజకీయ పార్టీలు మన ఓట్లను రాజకీయంగా వాడుకునేవారు. ప్రస్తుతం చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థిగా కాసాని జ్ఞానేశ్వర్‌కు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ టికెట్ ఇవ్వడం సంతోషంగా ఉన్నది. బీసీలంతా ఐకమత్యాన్ని ప్రదర్శించి కాసానిని గెలిపించుకోవాలి.

- వెంకటేశ్‌యాదవ్, నాస్పింగి

గెలిపించుకుంటేనే పరువు నిలుస్తుంది

కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటేనే బీసీల పరువు దక్కుతుంది. లేదంటే బీసీలను చులకన చేసి మాట్లాడుతారు. ఇప్పటికే బీసీలకు దమ్ము, ధైర్యం లేదంటున్నారు. బీసీలు ఒక్కటై కాసానికి సంపూర్ణ మద్దతు ఇవ్వాలి. మన ఓట్లు మనమే వేసుకుందామని ఇంటింటికీ తిరిగి ప్రచారం చేద్దాం.

- నరేశ్ కుమార్, ఆరె కటిక సంఘం నాయకుడు

మన ఓట్లు మనమే వేసుకుందాం

మన ఓట్లు మనమే వేసుకుందాం. బీసీ అభ్యర్థిని గెలిపించుకుందాం. 93 బీసీ కులాలను ఐక్యం చేద్దాం. రాజ్యాధికారం వైపు పయనిద్దాం. బీసీలకు పార్లమెంటు ఎన్నికల్లో సీట్లు ఇవ్వడానికి ఆలోచన చేస్తున్నారు. బీసీల గురించి మాట్లాడేవారికి గుణపాఠం చెప్పాలంటే చేవెళ్ల నుంచి బీసీ అభ్యర్థిని గెలిపించుకుందాం.

- వెంకటేశ్, రజక సంఘం నాయకుడు

బీసీ నాయకుడినే గెలిపించి తీరుతాం

బీసీలు పార్టీలకు అతీతంగా బీసీ అభ్యర్థి కాసానికి ఓటు వేసి గెలిపించాలి. బీసీలందరూ ఐకమత్యంతో రాజకీయ కుట్రలను తిప్పికొట్టాలి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాలుగు నెలలకే బీసీలంటే చిన్నచూపు చూస్తున్నది. చేవెళ్ల ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి కాంగ్రెస్ లాంటి పార్టీలకు బుద్ధి చెప్పాలి.

- రాణి, కృష్ణ కాలనీ

కాసానిని గెలిపిద్దాం

చేవెళ్ల గడ్డపై రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసానికి ఓటు వేసి గెలిపించుకుంటాం. బీసీలందరం ఐక్యతతో ముందుకు సాగి కాంగ్రెస్ పార్టీకి బీసీల సత్తా ఏంటో చూపిస్తాం. బీసీలను చిన్నచూపు చూస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునే ప్రసక్తి లేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చీరాగానే ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదు.

- అశోక్, హఫీజ్‌పేట్



ముఖ్య నాయకులు, కార్యకర్తలను సముదాయిస్తున్న నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి

కాంగ్రెస్‌లో భగ్గుమన్న విభేదాలు

రంగారెడ్డి, ఏప్రిల్ 27 (నమస్తేతెలంగాణ): రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండల పరిధిలోని అయ్యసాగర్ క్షేత్ర సమీపంలో శనివారం కడ్తాల్, ఆమనగల్లు మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ మంత్రి చిత్తరంజన్‌దాస్, నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ ఠాగూర్ బాలాజీ సింగ్, కల్వకుర్తి అసెంబ్లీ కో-ఆర్డినేటర్ ఇంది రాశోభన్ హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే కడ్తాల్ మండలంలోని ఓ ముఖ్య నాయకుడు మాట్లాడుతూ.. తాము కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్నామని.. అయినా తమకు గుర్తింపు లేకుండా పోయిందన్నారు. స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తమను పట్టించుకోవడంలేదని వాపోయారు. ఎంపీ అభ్యర్థి మల్లు రవి వెంటనే లేచి, ఆ నాయకుడి దగ్గరకు వచ్చి మైక్ తీసుకునే ప్రయత్నం చేయగా.. కింద ఉన్న కొంత మంది నాయకులు మైక్ లాగొద్దని.. తమ బాధను చెప్పకోవడంలో తప్పేముందని గొడవ చేశారు. స్టేజీ దిగిన మల్లు రవి, ఇందిరాశోభన్ ముఖ్య కార్యకర్తలను సముదాయించే ప్రయత్నం చేయగా కొంత ఉద్రిక్తత నెలకొని తరువాత సద్దుమణిగింది.

కాసానికి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలి

రావులపల్లి గ్రామంలో కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేవెళ్లటౌన్, ఏప్రిల్ 27 : బీసీ నేత, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రంగారెడ్డి డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్ ప్రజలను కోరారు. శనివారం చేవెళ్ల మండల పరిధిలోని ధర్మసాగర్, గొల్లపల్లి, రావులపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని, కేసీఆర్ పాలనలోనే తమకు న్యాయం జరిగిందని ప్రజలు అంటున్నారని తెలిపారు. కేసీఆర్ హయాంలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు పేద ప్రజకు అందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పినా.. అధికారంలోకి వచ్చి ప్రజలకు మొండిచేయి చూపించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి కూడా పూర్తి స్థాయిలో ఒక్కటి కూడా అమలు చేయలేదన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ప్రతి పంటకు క్వింటాలుకు రూ.500ల బోనస్, రైతు భరోసా కింద సంవత్సరానికి ఎకరాకు రూ.15వేల పెట్టుబడి సాయం, వృద్ధులు, వితంతవులు, ఒంటరి మహిళలకు 2వేల నుంచి రూ.4వేలకు పెంపు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు చేయూత వంటి పథకాలను అమలు చేయలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మరోసారి లబ్ధి పొందేందుకు రూ.2లక్షల రుణమాఫీ ఆగస్టు 15 వరకు అమలు చేస్తామంటూ అబద్ధాలు చెబుతున్నదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ అమలు జరిగేంత వరకు ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు. రాష్ట్రంలో 4లక్షల మందికి పోడు పట్టాలిచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి పనులు దేశానికే ఆదర్శంగా నిలిచాయని వారు పేర్కొన్నారు.

కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చింటు, చేవెళ్ల మండల మాజీ సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు శివారెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు శేఖర్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్, అంజయ్యగౌడ్, శంకర్‌యాదవ్, గణేశ్, చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింహులు, బీసీ సెల్ మండల అధ్యక్షుడు రాములు, మాజీ డైరెక్టర్లు మహేశ్, అబ్దుల్‌ఘనీ, నాయకులు రామాగౌడ్, విఠల్‌రెడ్డి, రాజు, మహేందర్, రాంప్రసాద్, శ్రీనివాస్, ఫసీ ఉన్నారు.

బీజేపీ ప్రభుత్వం దళితులకు ఎలాంటి అభివృద్ధి చేయలేదు

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 27 : గత 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బీజేపీ దళితుల అభివృద్ధి కోసం ఏమీ చేయలేదని తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ ముఖ్య కార్యకర్తల జిల్లా స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీలకు చాలా ప్రమాదం జరుగుతుందన్నారు. ఒకే మతానికి ప్రాధాన్యత కల్పిస్తూ ప్రచారం చేస్తున్నదని తెలిపారు. తనకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన గడ్డం రంజిత్‌రెడ్డి పట్ల కాంగ్రెస్ నాయకులు కోపంగా ఉన్నారని తెలుసు.. కాని కేంద్రంలో ఉన్న రాహుల్ గాంధీ కోసం పని చేయాలని కోరారు. రాహుల్‌గాంధీ ఆదేశాలను మనం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో స్పీకర్‌గా పని చేసిన పోచారం తన సొంత నియోజకవర్గానికి రూ.10వేల కోట్లతో అభివృద్ధి చేశారని, ప్రస్తుతం అంత బడ్జెట్ లేనందున రూ.3వేల కోట్లతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. వికారాబాద్ నియోజకవర్గ పంచాయతీ రాజ్ రోడ్ల కోసం రూ.250 కోట్లు, ఆర్ అండ్ బీ రోడ్ల కోసం రూ.222 కోట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేటాయించారని పేర్కొన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్టుకు రూ.100కోట్లు, జుంటుపల్లి ప్రాజెక్టు కోసం రూ.10 కోట్లు, శివసాగర్ చెరువు కోసం రూ.300 కోట్లు, దాదాపుగా రూ.3వేల కోట్లకు ప్రపోజల్ పంపించడం జరిగిందని తెలిపారు. ఎలక్షన్స్ తరువాత ఈ పనులన్నీ కూడా త్వరగా పూర్తవుతాయని స్పీకర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్, బంట్వారం జడ్పీటీసీ సంతోష, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజు, నాయకులు మల్లేశ్, అనంతయ్య, పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- రంగారెడ్డిజిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక, వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి
- చేవెళ్ల ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్రా, పోలీస్ అబ్జర్వర్ రాజీవ్‌చావ్రా సమక్షంలో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహిస్తున్న ఎన్నికల పరిశీలకులు, ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు

షాబాద్/వికారాబాద్, ఏప్రిల్ 27 : చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఎన్నికల నిర్వహణ కోసం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలయ్యేలా పకడ్బందీ చర్యలు చేపట్టామని రంగారెడ్డిజిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని చేవెళ్లకు నియమితులైన ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, వ్యయ పరిశీలకులు రాజీవ్ చావ్రా, పోలీస్ అబ్జర్వర్ రాజీవ్‌చావ్రాలు శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఏఆర్ఓలు, పోలీసు అధికారులు, నోడల్ ఆఫీసర్లతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఎన్నికల నియమావళి అమలు, పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు చేపట్టిన చర్యలు గురించి కలెక్టర్లు అబ్జర్వర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

అన్ని చర్యలు తీసుకుంటున్నాం..

పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, రాజేంద్రనగర్, చేవెళ్ల, శేరిలింగంపల్లి, అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు వికారాబాద్ జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని వివరించారు. 8 సెగ్మెంట్ల పరిధిలో 3,306 పోలింగ్ కేంద్రాలు ఉండగా, తగిన సిబ్బందిని పోలింగ్ విధుల కోసం నియమించినట్లు తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల కనుగుణంగా ప్రతి నియోజకవర్గం పరిధిలో పోలింగ్ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలను, ఒకటి చొప్పున దివ్యాంగుల బృందం, యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేసినట్లు వివరించారు. ఎన్నికల నియమావళి తప్పకుండా అమలయ్యేలా అన్ని చర్యలు తీసుకున్నామని, సంబంధిత కమిటీలను నియమించి పకడ్బందీ పర్యవేక్షణ చేస్తున్నామన్నారు. అభ్యర్థులు, ఆయా పార్టీల ఎన్నికల వ్యయాన్ని లెక్కించేందుకు ఏర్పాటు చేసిన కమిటీలు ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి అన్ని విధాలుగా పరిశీలన జరుపుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా నగదు, మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. ఎఫ్.ఎస్.టీ, ఎస్.ఎస్.టీ బృందాలు నిరంతర సోదాలు నిర్వహిస్తున్నాయని, పట్టుబడిన నగదుకు సంబంధించి ఆధారాలు కలిగి ఉన్నవారికి గ్రీవెన్స్ కమిటీ ద్వారా పరిశీలన జరిపించి నగదును తిరిగి అందజేస్తున్నామని తెలిపారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించేందుకు వీలుగా ఐడీఓసీలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, సి.విజిల్, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా కూడా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్.ఎస్.టీ, ఎస్.ఎస్.టీ బృందాలు తక్షణం స్పందించేలా చర్యలు తీసుకున్నామని వారు వివరించారు.

ఈవీఎంల మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. పోలింగ్ సిబ్బందికి మొదటి విడుత శిక్షణా తరగతులు పూర్తి చేశామని, మే 1, 2 తేదీల్లో రెండో దఫా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను గుర్తించి అదనపు బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, 85 ఏండ్లు పైబడిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, దివ్యాంగ ఓటర్లకు ముందస్తుగానే 12-డీ ఫారాలు అందించినట్లు చెప్పారు. ఇంటి నుంచి ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారి ఓట్లను సేకరించేందుకు వీలుగా పోలింగ్ బృందాలను నియమించామని, ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా వారి ఇండ్లకు వెళ్లి గోప్యతను పాటిస్తూ ఓటింగ్ నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా రంగారెడ్డి జిల్లా, వికారాబాద్ జిల్లాల పోలింగ్ సిబ్బంది రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియను సాధారణ పరిశీలకులు రాజేందర్ కుమార్ కటారియా, పోలీస్ పరిశీలకులు కాలురామ్ రావత్‌ల సమక్షంలో పూర్తి చేశారు. శాంక, నారాయణరెడ్డితో కలిసి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్.ఐ.సి హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. జనరల్ అబ్జర్వర్ ర్యాండమైజేషన్‌ను నిశితంగా పరిశీలించారు.

పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో గల పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలింగ్ సిబ్బందికి ఇప్పటికే ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌చే పోలింగ్ నిర్వహణపై మొదటి విడుత శిక్షణ తరగతులు నిర్వహించామని, మే 1, 2 తేదీల్లో రెండో విడుత శిక్షణకు ఏర్పాట్లు చేశామని కలెక్టర్లు పరిశీలకులకు వివరించారు. రిజర్వు సిబ్బంది సైతం అందుబాటులో ఉంటారని, పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ప్రతి బృందంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, ఒక సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఇతర పోలింగ్ సిబ్బంది ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ స్నేహ, వికారాబాద్ అదనపు కలెక్టర్లు రాహుల్‌శర్మ, ఉమాహారతి, ఆర్ఓలు, నోడల్, డీసీపీలు, పోలీసు అధికారులున్నారు.

ఫిర్యాదులు, సూచనలకు పరిశీలకులను సంప్రదించవచ్చు

షాబాద్ : చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదులు, సూచనలు చేయవచ్చని రంగారెడ్డిజిల్లా ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక సూచించారు. సాధారణ పరిశీలకులుగా రాజేందర్ కుమార్ కటారియా ఐఏఎస్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. చేవెళ్ల పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని ఎన్నికల సంబంధిత అంశాలపై ఫిర్యాదులు చేయదలచినవారు జనరల్ అబ్జర్వర్‌ను సెల్ నం.7032666271 ద్వారా సంప్రదించవచ్చని సూచించారు. పోలీసు పరిశీలకులు రాజీవ్ చావ్రా సెల్ నం.7032666274, పి.సెందిల్‌కుమార్ సెల్ నం. 7032666273 ద్వారా వ్యయ అబ్జర్వర్లను సంప్రదించవచ్చని సూచించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అబ్జర్వర్లు పార్లమెంటు నియోజకవర్గంలో అందుబాటులో ఉండి ఎన్నికల సంబంధిత అంశాలను పరిశీలిస్తారని, సెలవు దినాల్లో మినహాయించి మిగతా రోజుల్లో నిర్దిష్ట సమయాల్లో పరిశీలకులను సంప్రదించవచ్చన్నారు.

**ప్రతి ఒక్కరూ త